క్లుప్తంగా

పోలీస్‌స్టేషన్‌లో డీసీపీ తనిఖీలు



సంగెం : మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్‌కుమార్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను, పరిసరాలను పరిశీలించి అధికారులు, సిబ్బందికి సూచనలు చేశారు. విధినిర్వహణలో నిబద్ధతతో పని చేయాలని చెప్పారు. తొలుత పోలీస్‌స్టేషన్ ఆవరణలో పోలీసు అధికారులు, సిబ్బందితో కలిసి డీసీపీ అంకిత్‌కుమార్ మొక్క నాటారు. కార్యక్రమంలో మామునూరు ఏసీపీ వెంకటేశ్, పర్వతగిరి సీఐ రాజగోపాల్, ఎస్సైలు నరేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక



నల్లబెల్లి : నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి సమక్షంలో మండల కేంద్రానికి చెందిన నాయకుడు, మాజీ 1వ వార్డు సభ్యుడు పరికి నవీన్ శనివారం కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా నవీన్‌కు ఎమ్మెల్యే మాధవరెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించి అభినందించారు. కార్యక్రమంలో పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు బత్తిని మహేశ్, నాయకులు మాసంపల్లి అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

ఎక్స్‌గ్రేషియా చెక్కు పంపిణీ

నెక్కొండ : మండలంలోని అలంకానిపేటకు చెందిన చీకటి యాకయ్య గతేడాది విద్యుదాఘాతంతో మృతి చెందగా బాధిత కుటుంబానికి మంజూరైన రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా చెక్కును నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి శనివారం తన క్యాంప్ కార్యాలయంలో పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. విద్యుత్ ప్రమాదాల బారిన పడి కుటుంబ యజమాని మృతి చెందితే నిబంధనల మేరకు ఎక్స్‌గ్రేషియా అందుతుందని చెప్పారు. కార్యక్రమంలో ఆర్డీఓ ఉమారాణి, తహసీల్దార్ రాజ్‌కుమార్, విద్యుత్ శాఖ డీఈ తిరుపతి, ఏడీఏ శ్రీధర్, ఏఈ చిరంజీవి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బక్కి అశోక్, గ్రామ శాఖ అధ్యక్షుడు రాంపెల్లి శ్రావణ్ కుమార్, మండల ఉపాధ్యక్షుడు ఆకుల ఉప్పలయ్య, తదితరులు పాల్గొన్నారు.

పోచమ్మ గుడి స్థలాన్ని కాపాడాలి



నర్సంపేట : పట్టణంలోని పదో వార్డులోని పోచమ్మగుడి స్థలాన్ని కబ్జాదారుల నుంచి కాపాడాలని ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యుడు నాగిశెట్టి ప్రసాద్ కోరారు. ఆలయ ఆవరణలో కాలనీవాసులతో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దాతల, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి సహకారంతో ఆలయాన్ని అభివృద్ధి చేసినట్టు తెలిపారు. కొందరు నాయకులు ఆలయ భూమిని కబ్జా చేసేందుకు యత్నిస్తున్నారని ఆరోపించారు. కబ్జాకు యత్నిస్తున్న వారికి గుణపాఠం చెప్పాలని కోరారు.

ఆర్థికసాయం



నర్సంపేట : చెన్నారావుపేట మండలంలోని లింగాపురం గ్రామానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్త బొక్కల జంపయ్య ఇటీవల మృతి చెందగా ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ఆదేశాల మేరకు బాధిత కుటుంబానికి ఆ పార్టీ గ్రామ కమిటీ ఆధ్వర్యంలో శనివారం రూ.6,500 సాయం అందించారు. తొలుత జంపయ్య చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ సర్పంచ్ తప్పెట రమేష్, గ్రామ కమిటీ అధ్యక్షుడు మచ్చిక కుమారస్వామి, నాయకులు పురం బాబురావు, తప్పెట స్వామి, పల్లాటి రమేశ్, ముదిగొండ చంద్రమౌళి, ముదిగొండ బాబు, మైదం సూరయ్య, మైదం నర్సింగం, మైదం అనిల్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో..

రాయపర్తి : ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ సహకారంతో ప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు మండలంలోని క్రిష్టాపురం గ్రామానికి చెందిన గిద్దె సుష్మితకు ఐఐటీలో సీటు సాధించిన సందర్భంగా రూ.5 వేల సాయం అందజేసి శాలువాతో సత్కరించారు. అనంతరం రాయపర్తికి చెందిన గారె నరేశ్ టైఫాయిడ్‌తో బాధపడుతుండగా వైద్యం కోసం ఆయనకు రూ.3 వేల నగదు అందజేశారు. కార్యక్రమాల్లో బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి పూస మధు, అధికార ప్రతినిధి సంతోశ్, నాయకులు జినుగు అనిమిరెడ్డి, నర్సింహాచార్యులు, గజవెల్లి ప్రసాద్, సంకినేని నవీన్, తదితరులు పాల్గొన్నారు.

కొంగుబంగారం కోటమైసమ్మ

- నేడు భారీ ఎత్తున పండుగ
- బంగారు బోనం సమర్పించనున్న మంత్రి సురేఖ





కోటమైసమ్మ విగ్రహం, ఆలయం

గీసుకొండ : మండల పరిధిలోని వరంగల్–నర్సంపేట ప్రధాన రహదారి పక్కనే కోటగండి వద్ద కొలువైన కోటమైసమ్మ తల్లి భక్తులకు కొంగుబంగారంగా నిలుస్తోంది. ఏటా ఉమ్మడి జిల్లా నుంచే కాకుండా హైదరాబాద్, భద్రాచలం, గుల్బర్గా, తదితర ప్రాంతాల నుంచి భక్తులు వచ్చి బోనం సమర్పించి గొర్రెలు, మేకలు, కోళ్ల బలి ఇచ్చి మొక్కులు చెల్లించడం ఆనవాయితీగా వస్తోంది. నేడు బోనాల పండుగ నిర్వహించడానికి నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. మైసమ్మ తల్లికి మంత్రి కొండా సురేఖ స్వయంగా బంగారు బోనం సమర్పించనున్నారు.

మట్టికోట తొలచిన సమయంలో వెలసిన తల్లి

కాకతీయుల కాలంలో నిర్మించిన మట్టికోటను శతాబ్దాల క్రితం తొలచి రహదారి నిర్మించిన సమయంలో కోటమైసమ్మ వెలసిందని ప్రతీతి. నాడు రాయి రూపంలో ఉన్న తల్లిని భక్తులు పూజించి కోర్కెలు నెరవేర్చుకున్నట్టు ప్రచారంలో ఉంది. కోర్కెలు నెరవేరిన కొందరు భక్తులు అమ్మవారికి చిన్నపాటి గుడి నిర్మించి పూజలు చేశారు. ఆ కాలంలో గుడి సమీపంలోని పొలాల్లో పండించిన పంటను రైతులు నైవేద్యంగా సమర్పించినట్టు సమాచారం. ఏటా ఆషాఢ మాసంలో పండుగ చేసి మైసమ్మ తల్లికి బోనాలు సమర్పించడం అప్పటి నుంచి ఆనవాయితీగా వస్తోంది. నాటి కాలంలో గుడి పరిసరాలకు చెందిన ప్రజలు కోర్కెలు నెరవేరిన క్రమంలో జీవితంలో తాము ఎక్కడ స్థిరపడ్డా ఏటా గుడికి వచ్చి బోనాలు సమర్పిస్తామని మొక్కి ఇప్పటికీ ఆచరిస్తున్నారు. ఈ క్రమంలోనే హైదరాబాద్, భద్రాచలం నుంచే కాకుండా గుల్బర్గా నుంచి సైతం భక్తులు వచ్చి బోనం సమర్పించి పండుగలో భాగస్వాములవుతున్నారు.

కొండా దంపతుల సొంత డబ్బుతో..

భక్తుల కోర్కెలు తీర్చే తల్లిగా కోటమైసమ్మ ప్రసిద్ధి గాంచడంతో మండల, జిల్లా రాజకీయాల్లో క్రియాశీలకంగా ఉన్న కొండా దంపతులు 2009లో సొంత డబ్బుతో మైసమ్మ గుడిను కొత్తగా నిర్మింపజేశారు. భారీ విగ్రహాన్ని ఏర్పాటు చేయించి వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ ప్రాణప్రతిష్ఠ చేయించారు. ఇప్పటికీ వారి సొంత డబ్బుతోనే ఆలయ నిర్వహణ కొనసాగుతోంది. ఆలయ అభివృద్ధి నేపథ్యంలో భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చి మొక్కులు చెల్లించడం కొనసాగుతోంది. ఏటా దసరా, సంక్రాంతి, ఉగాది, ఉగాది, నూతన సంవత్సర ప్రారంభం, తదితర సందర్భంగా సైతం భక్తులు వచ్చి పూజలు నిర్వహిస్తున్నారు.

పలు కుటుంబాలకు ఉపాధి

బోనాల సందర్భంగా భక్తులు వాహనాలకు సైతం పూజలు చేయిస్తున్నారు. భక్తులకు కొబ్బరికాయలు, ఇతర సామగ్రి విక్రయించేందుకు దుకాణాలు వెలిశాయి. హోటళ్లు, ఇతర వ్యాపారాలతో పలు కుటుంబాలు ఉపాధి పొందుతున్నాయి.

వంచనగిరి నుంచి రానున్న మంత్రి సురేఖ

నేడు బోనాల పండుగ సందర్భంగా వంచనగిరి గ్రామస్తులతో కలిసి మంత్రి కొండా సురేఖ బంగారు బోనంతో కోటమైసమ్మ గుడికి రానున్నారు. ఈ మేరకు కొండా దంపతుల అభిమానులు, వంచనగిరి గ్రామస్తులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు.

అటెండర్‌పై ఏపీఓ దౌర్జన్యం

- కంటతడి పెట్టిన బాధితుడు

నల్లబెల్లి : అటెండర్‌పై ఏపీఓ దాష్టీకానికి పాల్పడిన ఘటన మండలంలో శనివారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎంపీడీఓ కార్యాలయ ఉద్యోగుల కథనం ప్రకారం.. ఎంపీడీఓ కార్యాలయంలో ఉద్యోగుల హాజరు రిజిస్టర్ కనిపించకపోవడంతో పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ ఉద్యోగులకు ఫోన్ చేసి కనుక్కోమని సూపరింటెండెంట్ ఆబిద్ అలీ ఆదేశించడంతో అటెండర్ విశ్వాస్ ఉద్యోగులతోపాటు ఏపీఓ వెంకట్‌నారాయణకు ఫోన్ చేసి రిజిస్టర్ విషయాన్ని అడిగారు. రిజిస్టర్ తీసుకోలేదని సమాధానం చెప్పిన ఏపీఓ వెంకట్‌నారాయణ మధ్యాహ్న సమయంలో మండల పరిషత్ కార్యాలయానికి చేరుకుని తోటి ఉద్యోగులతో కలిసి భోజనం చేస్తున్న అటెండర్ విశ్వాస్‌పై కర్రతో భౌతిక దాడికి యత్నించాడు. భోజనం చేసే టేబుల్‌ను గుద్దుతూ దూషించాడు. సూపరింటెండెంట్ ఆదేశాల మేరకే తాను ఫోన్ చేసినట్టు చెప్పినా వినకుండా దూషించడంతో అటెండర్ విశ్వాస్ కంటతడి పెట్టాడు. ఈ ఘటన ఉద్యోగుల్లో కలకలం రేపింది. కాగా ఘటనను ఏపీఓ ఖండించారు. తాను హాజరు రిజిస్టర్ దొంగిలించినట్టు విశ్వాస్ మాట్లాడాడని, సక్రమంగా విధులు నిర్వర్తించాలని తాను చెప్పడంతో ఆరోపణలు చేస్తున్నాడని తెలిపాడు.

విద్యాసంస్థల బంద్ పాటించాలి

- విద్యార్థి సంఘాల నాయకులు



నర్సంపేట : నినాదాలు చేస్తున్న నాయకులు

నర్సంపేట/నెక్కొండ : రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకపోవడంతోపాటు ఇతర సమస్యలను నిర్లక్ష్యం చేయడాన్ని నిరసిస్తూ ఈనెల 23న విద్యాసంస్థల బంద్ పాటించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు దిడ్డి పార్థసారథి, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు గుర్రం అజయ్, ఎస్ఎఫ్ఐ ఎస్ఎఫ్ఐ డివిజన్ కార్యదర్శి పైస గణేశ్, మండల కార్యదర్శి బానోతు వినోద్‌కుమార్ కోరారు. నర్సంపేటలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం నిర్వహించిన సమావేశంలో పార్థసారథి, అజయ్, గణేశ్, నెక్కొండలో నిర్వహించిన సమావేశంలో వినోద్‌కుమార్ మాట్లాడారు. స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు అందక విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమవుతున్న దుస్థితి నెలకొందని ఆందోళన వెలిబుచ్చారు. ప్రభుత్వ స్కూళ్లు, కళాశాలల్లో సరైన వసతుల్లేక విద్యార్థులు వేదనకు గురవుతున్నారని చెప్పారు. గత ప్రభుత్వం విద్యార్థి వ్యతిరేక విధానాలు అవలంబించి అధికారాన్ని కోల్పోయిందన్నారు. ప్రభుత్వం ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలను పరోక్షంగా ప్రోత్సహించేలా ప్రభుత్వ స్కూళ్లు, కాలేజీలను నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. బంద్‌ను విజయవంతం చేయడం ద్వారా ప్రభుత్వానికి గుణపాఠం చెప్పాలని కోరారు. సమావేశాల్లో పీడీఎస్‌యూ డివిజన్ అధ్యక్షుడు రవి, విద్యార్థి సంఘాల నాయకులు నాయకులు పవన్, వరుణ్, కిరణ్, క్రాంతి, ప్రవళిక, కళ్యాణి, శ్వేత, రజని, నాగేంద్ర, బానోతు గణేష్, నవీన్, ధారావతు క్రాంతి, గుగులోతు చరణ్, ప్రశాంత్, గౌతమ్, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సేవలు అభినందనీయం



నోట్‌బుక్స్ పంపిణీ చేస్తున్న హెచ్‌ఎం రామ్మూర్తి, ఉపాధ్యాయులు

- హెచ్‌ఎం రామ్మూర్తి

నల్లబెల్లి : ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు వాసవీ క్లబ్ సేవలు అభినందనీయమని మండలంలోని నాగరాజుపల్లి శివారులోని పంతులుపల్లి ప్రైమరీ స్కూల్ హెచ్‌ఎం కర్ణకంటి రామ్మూర్తి అన్నారు. వరంగల్ వాసవీ క్లబ్ సెంట్రల్ ప్రతినిధులు ప్రైమరీ స్కూల్‌లో చదువుతున్న 20 మంది విద్యార్థులకు శనివారం 5 చొప్పున నోట్‌బుక్స్ అందజేశారు. ఈ సందర్భంగా రామ్మూర్తి మాట్లాడారు. వాసవీ క్లబ్ ప్రతినిధులు ఏటా ప్రభుత్వ స్కూళ్లలో చదువుతున్న పేద విద్యార్థులకు పుస్తకాలు అందిస్తూ ప్రోత్సహిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు గోనె శ్రీదేవి, ఆసం చంద్రమౌళి, మాజీ ఎంపీటీసీ ఏడాకుల రవిందర్, ఏఏపీసీ చైర్మన్ ఎరుకల వెంకటలక్ష్మి, ఉపాధ్యాయులు కూసమల్ల రాజన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

బోనాలతో విద్యార్థుల సందడి



నర్సంపేట : బోనాలతో వస్తున్న విద్యార్థులు

నర్సంపేట/నర్సంపేట రూరల్/రాయపర్తి/దుగ్గొండి: నర్సంపేట, రాయపర్తి, దుగ్గొండి మండలాల్లోని పలు ప్రైవేట్ స్కూళ్లలో శనివారం బోనాలతో విద్యార్థులు సందడి చేశారు. నర్సంపేటలోని బాలాజీ ఇంటిగ్రేటెడ్ టీచింగ్, అక్షర ద స్కూళ్లలో, లక్నేపల్లిలోని బాలాజీ టెక్నోలో, రాయపర్తి మండల కేంద్రంలోని లహరి, అదే మండలంలోని కాట్రపల్లిలోని సెయింట్ మేరీ, దుగ్గొండి మండలంలోని గిర్నిబావిలోని న్యూవిజన్ స్కూళ్లలో బోనాల పండుగ ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు పోతరాజుల వేషధారణతో, తలపై బోనాలతో అలరించారు. ఈ సందర్భంగా బాలాజీ విద్యాసంస్థల అధినేత డాక్టర్ ఏ.రాజేంద్రప్రసాద్‌రెడ్డి, ఇతర స్కూళ్ల నిర్వాహకులు మాట్లాడారు. బోనాల పండుగ ప్రాశస్త్యాన్ని విద్యార్థులకు వివరించారు. ఆషాఢ మాసంలో తెలంగాణలో ప్రజలు భక్తిశ్రద్ధలతో బోనాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన కల్పించేలా ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఎల్‌ఓసీ అందజేత



పర్వతగిరి : మండల కేంద్రానికి చెందిన బంధారపు విజయ గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతూ నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా వైద్యం కోసం ప్రభుత్వం మంజూరు చేసిన రూ.1.50 లక్షల ఎల్‌ఓసీని ఆమె భర్త కుమారస్వామికి వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు తన క్యాంప్ కార్యాలయంలో శనివారం అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు. స్థానిక నాయకుల సమాచారంతో బాధిత కుటుంబానికి ఎల్‌ఓసీ మంజూరు చేయించినట్టు తెలిపారు. పేదలకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జాటోతు శ్రీనివాస్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి



పర్వతగిరి : మండల కేంద్రంలో ఎంపీడీఓ శంకర్ నాయక్ శనివారం ఇంటింటికీ మొక్కలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సమాజంలోని ప్రతిఒక్కరూ మొక్కలను నాటి సంరక్షించాలని కోరారు. హరితహారం కార్యక్రమంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని సూచించారు. కార్యక్రమంలో ఈసీ రాజు, పంచాయతీ కార్యదర్శి రఘు, పంచాయతీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీ ఇంటర్‌లో రేపు స్పాట్ అడ్మిషన్లు

నర్సంపేట/సంగెం : చెన్నారావుపేట, సంగెం మండలాల్లోని కస్తూర్బా గాంధీ గురుకుల విద్యాలయాల్లో (కేజీబీవీ) ఇంటర్ ప్రవేశాల కోసం రేపు (ఈనెల 21న) స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తామని స్పెషల్ ఆఫీసర్లు మెట్టుపల్లి జ్యోతి, నీలిమ శనివారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. ఎంపీహెచ్‌డబ్ల్యూ (ఫిమేల్ నర్సింగ్), సీఈసీ విభాగాల్లో సీట్లు ఉన్నాయని పేర్కొన్నారు. అర్హత కలిగిన విద్యార్థులు నేరుగా వచ్చి అడ్మిషన్లు పొందాలని కోరారు.

బావిలో దూకి వృద్ధురాలి ఆత్మహత్య

నర్సంపేట రూరల్ : నర్సంపేటలోని వరమ్మతోటకు చెందిన మొలుగూరి భాగ్యమ్మ (68) అనారోగ్య కారణాలతో బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. ఎస్సై గూడ అరుణ్ కథనం ప్రకారం.. భాగ్యమ్మ పట్టణంలోని మల్లంపల్లి రోడ్డులో వెదరు బొంగులతో వివిధ వస్తువులు తయారు చేసి విక్రయిస్తూ జీవనం సాగిస్తోంది. ఆమె ఐదేళ్లుగా రొమ్ము కాన్సర్‌తో బాధపడుతోంది. నొప్పి భరించలేక రెండుసార్లు ఆత్మహత్యకు యత్నించింది. శుక్రవారం భాగ్యమ్మ ఇంట్లో కనపకపోకపోవడంతో కుటుంబీకులు బంధువుల ఇంటికి వెళ్లిందని భావించారు కాగా శనివారం ఉదయం వరమ్మతోట దిశగా బావిలో భాగ్యమ్మ మృతదేహం లభించింది. మృతురాలి కుమారుడు వేణు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నేడు సమావేశం

గీసుకొండ : మండలంలోని ఊకల్ క్రాస్ రోడ్డు సమీపంలోని ఎస్ఎస్ గార్డెన్స్‌లో నేడు (ఆదివారం) గీసుకొండ, సంగెం మండలాల బీఆర్ఎస్ ముఖ్యనాయకులు, క్రియాశీల కార్యకర్తల సమావేశం నిర్వహించనున్నట్టు ఆ పార్టీ మండల నాయకులు బోడకుంట్ల ప్రకాశ్, చల్లా వేణుగోపాల్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి హాజరై దిశానిర్దేశం చేస్తారని వివరించారు.

మహిళా సంక్షేమానికి ప్రాధాన్యం

- ఎంపీ కడియం కావ్య



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ కావ్య

సంగెం : మహిళా సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని వరంగల్ ఎంపీ కడియం కావ్య తెలిపారు. మండల కేంద్రంలోని శాంతి మండల సమాఖ్య భవనంలోని మొదటి అంతస్తులో రూ.8 లక్షల ఎంపీ నిధులతో చేపట్టిన అదనపు గదుల నిర్మాణ పనులకు పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి, కలెక్టర్ సత్యశారదతో కలిసి ఎంపీ కవిత శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపీ మాట్లాడారు. మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం పలు కార్యక్రమాలు చేపడుతోందని తెలిపారు. పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి మాట్లాడుతూ మహిళలను కోటీశ్వరులను చేయాలన్న సంకల్పంతో సీఎం కార్యాచరణ అమలు చేస్తున్నారని చెప్పారు. నియోజకవర్గ పరిధిలో త్వరలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్, మహిళా డెయిరీలు ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. సమావేశంలో జెడ్పీ సీఈఓ రాంరెడ్డి, డీఆర్‌డీఓ కౌసల్యాదేవి, అదనపు డీఆర్‌డీఓ రేణుకా దేవి, తహసీల్దార్ రాజ్‌కుమార్, ఎంపీడీఓ రవీందర్, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

నానో యూరియా వినియోగం మేలు

- ఏరువాక సాగుబడిలో ఏఓ శ్రీనివాస్



గీసుకొండ : డ్రోన్ ద్వారా ఎరువుల పిచికారీ విధానాన్ని వివరిస్తున్న ఏఓ హరిప్రసాద్, అధికారులు

ఖానాపురం : పంటలకు రసాయనిక ఎరువులకు ప్రత్యామ్నాయంగా నానో యూరియా వినియోగం మేలని మండల వ్యవసాయ అధికారి బోగ శ్రీనివాస్ తెలిపారు. ఏరువాక సాగుబడి కార్యక్రమంలో భాగంగా మండలంలోని అశోక్‌నగర్‌లో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన అవగాహన కల్పించారు. డ్రోన్ల ద్వారా నానో యూరియా పిచికారీ చేస్తే నాణ్యమైన దిగుబడి లభిస్తుందని చెప్పారు. పంట దశకు అనుగుణంగా యూరియా అందిస్తామన్నారు. సమావేశంలో సొసైటీ డైరెక్టర్ జాడి అచ్యుతం, రైతులు పాల్గొన్నారు.

మోతాదు మించొద్దు

గీసుకొండ : రైతులు పొలాల్లో పిచికారీ చేసే రసాయన ఎరువులు, పురుగు మందులు మోతాదుకు మించొద్దని మండల వ్యవసాయ అధికారి (ఏఓ) హరిప్రసాద్‌బాబు తెలిపారు. మండలంలోని ఎలుకుర్తి రైతువేదికలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన రైతులకు అవగాహన కల్పించారు. రసాయన ఎరువులు, క్రిమిసంహారక మందులు మోతాదుకు మించి పిచికారీ చేస్తే భూసారం కలుషితమై సదరు పంటను ఆహారంగా తీసుకున్న వ్యక్తులు క్యాన్సర్ బారిన పడే ఆస్కారం సైతం ఉందని నానో ఎరువులు పిచికారీ చేస్తే అధిక దిగుబడి వస్తుందన్నారు. ఇఫ్కో మేనేజర్ విశాల్ మాట్లాడుతూ ద్రవ రూపంలో ఉండే యూరియా, డీఏపీలు వినియోగిస్తే మేలని చెప్పారు. డ్రోన్ ద్వారా ఎరువుల పిచికారీ చేసే విధానాన్ని వివరించారు. కార్యక్రమంలో ఏఈఓ స్మిత, పంచాయతీ కార్యదర్శి నరేశ్, తదితరులు పాల్గొన్నారు.

గదులు అద్దెకిస్తే లైసెన్స్ తప్పనిసరి

- ఎంపీఓ, ప్రత్యేక అధికారి శేషాంజన్ స్వామి



సమావేశంలో మాట్లాడుతున్న శేషాంజన్‌స్వామి

పర్వతగిరి : మండలంలోని అన్నారం షరీఫ్ గ్రామంలో భక్తులకు గదులు అద్దెకు ఇచ్చే వ్యక్తులు గ్రామ పంచాయతీ నుంచి తప్పనిసరిగా లైసెన్స్ తీసుకోవాలని ఎంపీఓ, గ్రామ ప్రత్యేక అధికారి శేషాంజన్ స్వామి కోరారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో దుకాణాదారులు, గదులు అద్దెకు ఇచ్చే వ్యక్తులు, దర్గా సిబ్బందితో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. యజమానులు గదులు, షాపుల ఎదుట చెత్తాచెదారం వేయకుండా డస్ట్‌బిన్‌లు ఏర్పాటు చేసి చెత్తను ఖచ్చితంగా ట్రాక్టర్‌తో వచ్చే పంచాయతీ సిబ్బందికి అందించాలని చెప్పారు. అద్దె గదుల ఎదుట వాహనాలు నిలుపుతుండడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతున్న క్రమంలో పార్కింగ్ స్థలం ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. కిరాయికి గదులు తీసుకునే వ్యక్తులు ఆధార్, ఇతర వివరాలు తీసుకోవడంతోపాటు అనుమానితుల వివరాలు పోలీసులకు అందించి సహకరించాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్ట ప్రకారం చర్యలు తప్పవన్నారు. దర్గా పరిధిలో దర్గా సిబ్బందితో ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య పనులు చేయించాలని ఆదేశించారు. మిగతా ప్రాంతాల్లో పంచాయతీ సిబ్బంది పారిశుద్ధ్య పనులు చేస్తారన్నారు. సమావేశంలో పంచాయతీ కార్యదర్శి మొయినొద్దీన్, దర్గా సూపరింటెండెంట్ ముంతాజ్, కారోబార్ గుండా యాకయ్య, మాజీ ఉపసర్పంచ్ మదన్‌మోహన్, పంచాయతీ సిబ్బంది శ్రీను, కుమారస్వామి, మహేందర్, రాపోలు యాకయ్య, నారాయణ, రేణుక, యాదమ్మ, తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ టాపర్లకు నగదు ప్రోత్సాహకం



హిమబిందుకు నగదు అందజేస్తున్న అభయ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు, ఉపాధ్యాయులు

వర్ధన్నపేట : పట్టణంలోని ప్రభుత్వ హైస్కూల్‌లో 2024–25 విద్యాసంవత్సరంలో పదో తరగతి పరీక్ష రాసి టాపర్‌గా నిలిచిన హిమబిందుకు అభయ చారిటబుల్ ట్రస్టు సభ్యులు శనివారం రూ.5 వేల నగదు ప్రోత్సహకం అందజేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం అనిల్‌కుమార్ మాట్లాడారు. పాఠశాలలో 1987–88 విద్యాసంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వవిద్యార్థులు భయ చారిటబుల్ ట్రస్టు స్థాపించి నాలుగేళ్లుగా టాపర్లకు నగదు బహుమతి అందిస్తున్నట్టు తెలిపారు.


దమ్మన్నపేట హైస్కూల్‌లో..

మండలంలోని దమ్మన్నపేటలోని హైస్కూల్ టాపర్‌గా నిలిచిన తీగల శివకు ఆత్మీయ చారిటబుల్ ట్రస్టు సభ్యులు రూ.10 వేల ప్రోత్సాహకం అందజేశారు. పదో తరగతి విద్యార్థులకు డైరీలు అందించారు. అనంతరం హెచ్‌ఎం మహేశ్‌నాయక్ మాట్లాడారు. కార్యక్రమాల్లో ఉపాధ్యాయులు మనుజేందర్‌రెడ్డి, మదన్‌మోహన్, ఆయా ట్రస్టుల సభ్యులు అన్వర్, అహ్మద్, చంద్రమోహన్, రాజు, భరత్ కుమార్, రంగారావు తదితరులు పాల్గొన్నారు.

‘భూ భారతి’ని తక్షణమే అమలు చేయాలి

నర్సంపేట : భూ భారతి చట్టాన్ని తక్షణమే అమలు చేయాలని ఎంసీపీఐ(యూ) రాష్ట్ర నాయకుడు కన్నం వెంకన్న, మహిళా సంఘం రాష్ట్ర కార్యదర్శి వంగాల రాగసుధ, రైతు సంఘం రాష్ట్ర నాయకుడు నాగెల్లి కొమురయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక ఆర్డీఓ కార్యాలయ అధికారికి శనివారం వారు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. భూ భారతి చట్టాన్ని అమల్లోకి తీసుకురాకపోవడంతో రైతుల భూముల సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదన్నారు. పట్టణంలోని సర్వే నంబర్ 111లో పేదలు సుమారు 15 ఏళ్లుగా గుడిసెలు వేసుకుని నివాసం ఉంటున్నా పట్టాలివ్వలేదని చెప్పారు. కాలనీవాసులకు సౌకర్యాలు కల్పించడంలోనూ ప్రభుత్వం విఫలమైందని వివరించారు. గుడిసెవాసుల కాలనీలో అంతర్గత రోడ్లు, డ్రైనేజీ, తాగునీటి సౌకర్యం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఎంసీపీఐ(యూ) డివిజన్ సహాయ కార్యదర్శి రాజమౌళి, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మహత్యకు యత్నించిన యువకుడి మృతి



మూర్తి (ఫైల్)

పర్వతగిరి : భూవివాదం నేపథ్యంలో మనస్తాపానికి గురై ఆత్మహత్యకు యత్నించిన యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన మండలంలో శనివారం చోటు చేసుకుంది. ఎస్సై బోగం ప్రవీణ్ కథనం ప్రకారం.. మండలంలోని రోళ్లకల్‌కు చెందిన నాల్లం మల్లయ్యకు, జనగాం సమ్మయ్యకు మధ్య భూవివాదం నెలకొంది. ఈ క్రమంలో ఇటీవల గొడవ చోటు చేసుకోగా గ్రామ పెద్దలు గెట్లు నాటించారు. కాగా మనస్తాపానికి గురైన మల్లయ్య మనుమడు నాళం మూర్తి (24) గడ్డి మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. కుటుంబీకులు, స్థానికులు వరంగల్‌లోని ఓ ఆస్పత్రిలో చేర్చగా పరిస్థితి విషమించి మృతి చెందాడు. మల్లయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి

మూర్తి ఆత్మహత్యకు బాధ్యులైన వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకోవాలని అతడి కుటుంబీకులు, బంధువులు డిమాండ్ చేస్తున్నారు. సుమారు 25 ఏళ్ల క్రితం నాటి భూవిక్రయానికి సంబంధించి జనగాం సమ్మయ్య, అతడి కుమారుడు రాజు గొడవ చేసి అవమానించడంతోనే మూర్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడని ఆరోపించారు. ఘటనపై సమగ్ర దర్యాప్తు చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.